## పంటపొలాలపై గజరాజుల దాడులు

పెద్దపంజాణి, మార్చి 1 ప్రభాతవార్త



మండలంలోని పొట్టగాని పల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాలపై ఏనుగులు దాడులు చేశాయి. నాలుగు ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి పొట్టగానిపల్లి గ్రామ సమీపంలో పంట పొలాల్లోకి ప్రవేశించాయి. రైతులు నాగేశ్వరరావు, శంకరప్పలకు చెందిన కర్బూజా, అరటితోటలను ధ్వంసం చేశాయి. పంటలు కోల్పోయిన రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏనుగుల దాడులను అటవీ అధికారులు నిరోధించాలని రైతులు కోరుతున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పేలిన సిలిండర్

### ఐదుగురికి తీవ్రగాయాలు
### ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడిన బాధితులు

సూళ్లూరుపేట, మార్చి 1 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని మహదేవయ్య నగర్‌లో సిలిండర్ పేలిన దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మహదేవయ్యనగర్‌లో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన పానీపూరి వ్యాపారి బాహిద్ ఇంట్లో పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్ నింపుతుండగా, ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై ఈ దుర్ఘటన జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న బాహిద్‌తో పాటు అతని భార్య రూబి, కుమారుడు నౌషాద్, కుమార్తెలు నగ్మ, ఆస్మాలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో తల్లి రూబి, కుమార్తె నగ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని జూలాన్ జిల్లా పరిధిలో ఉన్న రెండర్ మండలంలోని బరోలి గ్రామానికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉత్సాహంగా యువగళం పాదయాత్ర

## నేంద్రగుంట వద్ద 400 కి.మీ. శిలాఫలకం



పాకాల/చంద్రగిరి, మార్చి 1 ప్రభాతవార్త:

టిడిపి జాతీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం గాదంకి టోల్‌ప్లాజా నుండి యువత, టిడిపి శ్రేణులతో కలిసి ఉత్సాహంగా ప్రారంభమయ్యింది. 31వ రోజున యువగళం పాదయాత్ర 400 కిలోమీటర్లు మైలురాయిని చేరుకోవడంతో నేంద్రగుంట వద్ద నారా లోకేష్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఇక్కడ 10 పడకల ఆసుపత్రిని ఏర్పాట చేస్తానని అన్నారు. "నా అడగులు సంక్షేమానికిదారులు, నా పరిశీలన సమస్యల పరిష్కారానికి మార్గం అంటూ యువగళం పాదయాత్ర 400 కిలోమీటర్లు మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో ఇక్కడ 10 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తానంటూ శిలాఫలకంపై లిఖించారు. పాదయాత్రలో గాదంకి వద్ద కాపు సామాజిక నేతలను పలకరించారు. నేంద్రగుంట గ్రామస్థులతో ఆత్మీయ సంభాషణలు, పాకాలలో ట్రైలర్లతో మాటామంతీ, గ్రామస్థులతో భేటీ, పాకాల జడ్పీ హైస్కూల క్రాడాకారులతో ఆటవిడుపుగా వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అనిత, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డి, యువజన నాయకుడు పులివర్తి వినీల్, టిడిపి నాగరాజు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఫల్గుణ, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సావిత్రమ్మ, మాజీ జడ్పీటిసిలు సురేష్ చౌదరి, విజయలక్ష్మి, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు డేవిడ్ సురేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### రాజగోపుర ద్వార బంధనాలకు
## పంచలోహ కవచాలు ఏర్పాటు



కాణిపాకం, మార్చి 1 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్తానం రాజగోపురం ద్వార బంధనాలకు పంచలోహ కవచాల ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. దాతల సహకారంతో శ్రీరంగం ఆలయంలో వున్న ద్వార బంధనాలకు వున్న పంచలోహ కవచాల తరహాలో రాజగోపురంకు వున్న రెండు ద్వార బంధనాలకు పంచలోహ కవచాలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 14 లక్షల రూపాయల వ్యయ అంచనాలతో 400 కిలోల పంచలోహాలతో కవచాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈపనులను ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు బుధవారం ఉదయం ప్రత్యేకపూజలు చేసి ప్రారంభించారు. ఇప్పటికే ద్వార బంధనాలకు కావలసిన రీతితో కవచాలను తయారు చేయగా వాటిని సుమారు 10 మంది కార్మికులు ద్వారాలకు అమర్చే పనులు నిర్వహిస్తున్నారు. వీటిని ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఈఈ వెంకట నారాయణలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### శ్రీసిటీని సందర్శించిన
## శ్రీలంక డిప్యూటీ హైకమీషనర్

**పారిశ్రామిక ప్రగతిపై ప్రశంస**
**శ్రీసిటీ తరహాలో శ్రీలంకలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ఆహ్వానం**



శ్రీసిటీలో శ్రీలంక డిప్యూటీ హైకమీషనర్ బృందం పర్యటించిన దృశ్యాలు

సత్యవేడు, మార్చి 1,ప్రభాతవార్త:

చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమీషనర్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆయనకు సాధర స్వాగతం పలికి పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను, శ్రీలంకతో శ్రీసిటీ వ్యాపార అనుబంధం వంటి తదితర అంశాలను గురించి వివరించారు. శ్రీసిటీలో మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని వెంకటేశ్వరన్ ప్రశంసించారు. మేక్ ఇన్ ఇండియా తరహాలో మేక్ ఇన్ శ్రీలంక అభివృద్ధికి తమ ప్రభుత్వం ముందుకు వెలుతోందన్న ఆయన, శ్రీలంకలో పెట్టుబడి అవకాశాలు, ఇతర ప్రయోజనాలను వివరించారు. ఏళ్ళ తరబడి భారత్‌తో తమకున్న బలమైన అనుబంధాన్ని ప్రస్తావించిన ఆయన, ఇరు దేశాల వ్యాపారబంధం మరింత పటిష్టం చేయడానికి పరస్పర సహకారం అవసరమన్నారు. శ్రీలంకలో శ్రీసిటీ మోడల్ ఇండస్ట్రియల్ సిటీని ఏర్పాటు చేయాలంటూ శ్రీసిటీ ఎండీకి ఆహ్వానం పలికారు. శ్రీసిటీ సందర్శనకు విచ్చేసినందుకు శ్రీలంక డిప్యూటి హైకమీషనర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రవీంద్రసన్నారెడ్డి, శ్రీసిటీ గురించి తెలుసుకోవడానికి శ్రద్ధ చూపడాన్ని తాము గౌరవప్రధంగా భావిస్తున్నామని అన్నారు. ఈపర్యటన ఫలితంగా ఇరుదేశాల వ్యాపారబంధం మరింతపటిష్టం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### గంగమ్మతల్లి ఆశీస్సులతో
## స్తంభవర్గంకు పూజలు

తిరుపతి,మార్చి 1 ప్రభాతవార్త:



తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణపనుల్లో బుధవారం ఉదయం స్తంభవర్గం(ఆరవ వరుస) పూజలు జరిగాయి. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, దేవదాయశాఖ డిఇ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ స్తంభవర్గంకు విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో ఇప్పటికీ ఐదువరుసలు పనులు పూర్తయ్యాయి. ఆరవవరుస పనులకు గంగమ్మతల్లి ఆశీస్సులు తీసుకుని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రౌడీషీటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

### - జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి



కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త

రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కుప్పం సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ కేసుల రికార్డులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యల గురించి సమీక్షించారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రత నియమాలు, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళల పట్ల నేరాలు, బాలికల మిస్సింగ్ తదితర రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల్లో నిందితులను త్వరగా పట్టుకుని అరెస్ట్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్లలోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి కేసులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సివిల్, భూతగాదాలు, పాత కేసుల్లో ఉన్న వారితో పాటునాటుసారా విక్రేత లను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సిఐ శ్రీధర్, రూరల్ సిఐ రియాజ్ అహ్మద్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో పెచ్చుమీరిన చోరీలు

### పరిశ్రమలతో పాటు బహుళ అంతస్తుల భవనాలే టార్గెట్
### అంతర్‌రాష్ట్ర ముఠాలోని ఏడుగురి పట్టివేత



తడ, మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో తిరుపతి జిల్లాలోని వివిధ పరిశ్రమలు, బహుళ అంతస్తుల భవనాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడే వారు ఎక్కువయ్యారు. ఈ ప్రాంతంలో ఇటీవల స్థాపించిన పలు పరిశ్రమలతో పాటు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడంతో తమిళనాడులోని నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు కొంతకాలంగా అనుమానాలు ఉన్నాయి. సరిహద్దుల్లోని తడ పోలీసులు ఇటీవల ఈ దొంగతనాలకు సంబంధించి తమిళనాడులో విస్తృతంగా దర్యాప్తు చేపట్టారు. శ్రీసిటీ, తడ పోలీసుస్టేషన్ల పరిధిలో వచ్చిన ఫిర్యాదులు అందుకొని దర్యాప్తును వేగవంతం చేశారు. గత నెల చివరి వారంలో తడ వద్ద జరిగిన ఒక కేసుకు సంబంధించి పోలీసు బృందం తమిళనాడుకు వెళ్లగా అక్కడ సమీపంలోని సెజ్‌లలో లక్షలాది రూపాయలు విలువైన కాపర్ వైర్ కాయిల్స్ కూడా పట్టుబడ్డాయి. పోలీసులు తీగ లాగడంతో తమిళనాడుకు చెందిన నలుగురితో పాటు చిత్తూరుకు చెందిన మరో ముగ్గురు పట్టుబడ్డారు. ఇటీవల తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సాధారణ తనిఖీలలో భాగంగా తడ పోలీసుస్టేషన్‌కు వచ్చి సిబ్బందిని అప్రమత్తం చేయడంతో నాయుడుపేట డిఎస్పి ఎం.రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో సూళ్లూరుపేట సిఐ ఐ.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యాన తడ ఎస్ఐ జె.పి.శ్రీనివాసరెడ్డి, సూళ్లూరుపేట రెండవ ఎస్ఐ శేఖర్ బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలించారు. తడ మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న పన్నంగాడు వద్ద రూ.6.35 లక్షల విలువైన 360 కిలోల కరెంటు వైర్ చుట్టలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ వైరును తమిళనాడుకు వెళ్లి నిందితులు విక్రయించేందుకు ఒక కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీసిటీ సెజ్‌లో నిర్మాణంలో ఉన్న ఒక కంపెనీ వద్ద నాలుగు డ్రమ్ములలోని కరెంటు కేబుల్ కాయిల్స్, తడలోని నిప్పో ఫ్యాక్టరీ సమీపంలో టి.తేజ అనే ఎలక్ట్రికల్ వైరు కాంట్రాక్టర్‌కు చెందిన 40 కరెంటు కాయిల్స్‌ను ఈ మేరకు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సరుకు కారుతో సహా ఏడుగురు నిందితులను త్వరితగతిన అరెస్టు చేశారు. చిత్తూరు పట్టణానికి చెందిన కవల సోదరులు ఎం.రామన్, ఎం.లక్ష్మణ్‌తో పాటు డి.ఆనందరాజును, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు పట్టణానికి చెందిన ఎస్.జగన్, ఉరపాకంకు చెందిన ఎస్.సెల్వన్, ఆర్.రఘుబాలన్, చెన్నైలోని మాడంబాకంకు చెందిన విజయ్‌కుమార్‌లను అరెస్టు చేసినట్లు నాయుడుపేట డిఎస్పి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సిఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసరెడ్డి, శేఖర్‌లతో పాటు తడ పోలీసుస్టేషన్ సిబ్బంది బి.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, సునీల్, విజయకుమార్, చంద్రలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

### ఉష్ణోగ్రతలు
1/3/2023



- తిరుపతి 34 డిగ్రీలు
- చిత్తూరు 34 డిగ్రీలు
- మదనపల్లి 28 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 34 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పక్కా చర్యలు

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అవసరమైన పక్కా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన కమీషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా అందుకు అవసరమైన పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. సమస్మాక పోలింగ్ స్టేషన్లపై దృష్టి కేంద్రీకరించి బందోబస్తు వ్యవస్థను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి హాజరైన కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ కమీషనర్‌కు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను వివరిస్తూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఆరు జిల్లాల డిఆర్‌ఓలు,



రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ వర్చువల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్, అడ్మిన్ ఎస్పీ జగదీష్‌లు

ఆర్డీఓలను సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీలోపు ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. 100 పోలింగ్ స్టేషన్లలో 48 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగా కలవని, ఈ పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. కాన్ఫరెన్స్‌లో అడ్మిన్ ఎస్పీ జగదీష్, ఆర్డీఓలు డాక్టర్ రేణుక, సృజన, శివయ్య, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## 4నాటికి పోలింగ్ మెటీరియల్ సిద్ధం చేస్తాం

### కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, మార్చి 1 ప్రభాతవార్త:

జిల్లాలో పోలింగ్ నిర్వాహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రిని ఈనెల 4నాటికి సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. పి.ఓ, ఏ.పి.ఓల రెండోవిడత శిక్షణ ఈనెల 9న నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ బందోబస్త్ ఏర్పాట్లకు జిల్లా పోలీసులను 1136, ఆర్మ్‌డ్ ఫోర్స్ 465మంది అవసరముందని జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డికి తెలపడం జరిగిందన్నారు. బుధవారం మధ్యాహ్నం అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లపై ఎన్నికలు జరుగుతున్న జిల్లాల కలెక్టర్లతో, ఎస్పీలతో వీడియో కాన్ఫరేన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, డిఆర్వో శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, వెంకట రావు, ఆర్డీఓలు రామారావు, కనకనరసారెడ్డి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరేన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు స్లిప్‌లను మార్చి8నాటికి పంఫిణి పూర్తి చేసి, అదేరోజున సాయంత్రానికి లేదా మరుసటిరోజు 9న ఓటరు స్లిప్ పంఫిణి చేసిన రశీదులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో పోలింగ్ నిర్వాహణపై వివరిస్తూ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబందించి 62 పోలింగ్ కేంద్రాలు అనుబంధంగా 39 అక్జలరీ పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, నేడు పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి చేసామని తెలిపారు.

### బంగారం ధరలు
1/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,235

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,711

### కోడిగ్రుడ్ల ధరలు
1/3/2023



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

# ఉత్తమ పౌరులుగా ఎదగాలి: పెద్దిరెడ్డి

సదుం, మార్చి 1 ప్రభాతవార్త

వచ్చే పదవతరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి తాము చదువుతున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు వచ్చి ఉత్తమపౌరులుగా ఎదగాలని జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం సదుంలోని జ్యోతీబాపూలే బీసీగురుకుల పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, సరస్వతిదేవి పూజ, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా గురుకుల పాఠశాల నుంచి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అదే ఈసారికూడా పునరావృతం కావాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి చదువులు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. అనంతరం



పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు ఏపి భవిష్యత్తుకు ఓ మలుపు కావాలి

-శీలం వెంకటేశ్వర్ రావ్

పలమనేరు, మార్చి 1, ప్రభాతవార్త:

ఈనెల 13 జరగనున్న ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు ఓ మలుపు కావాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పలమనేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శీలం వెంకటేశ్వర రావ్ పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు యూనిట్, క్లస్టర్ ఇన్చార్జీలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఏమాత్రం నిర్లక్ష్యం వహించక తెలుగు దేశం పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. నాయకులు కిషోర్ గౌడ్, రంగనాథ్, ఆర్బీసి కుట్టి, ఆనంద్, ఖాజా, చాంద్ బాషా పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

పలమనేరు, మార్చి 1, ప్రభాతవార్త:

పట్టబద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలకు సంభందించి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కుప్పుస్వామి బుధవారం పరిశీలించారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు ముందస్తుగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన పోలింగ్ కేంద్రంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై సిబ్బందికి సమీహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విద్యాసాగర్, ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరాలపై పోలీసుల దాడులు

-7 ద్విచక్రవాహనాలు సీజ్

పలమనేరు, మార్చి 1, ప్రభాతవార్త:

మండలంలోని కొలమాసనపల్లె పంచాయితీలో అక్రమంగా కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. కొలమాసనపల్లెలోని మాదిగబండ అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 13 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుండి 3 కోళ్లు, 9 సెల్ ఫోన్‌లు, రూ. 5,900 నగదుతో పాటు 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

## లోకేష్ పాదయాత్రకు సంఘీభావం



**గుడిపాల, మార్చి 1 ప్రభాతవార్త:** చంద్రగిరి నియోజకవర్గం పాకాలలో బుధవారం జరిగిన జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలో ఆయనను కలిసి మండల పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నేత 400 కిమీ పాదయాత్ర పూర్తి చేసుకొన్న సందర్భంలో తాను ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించడం జరిగిందన్నారు. నారా లోకేష్ పాదయాత్రకు ప్రజల్లో మంచి స్పందన వుందని రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బులు పంపిణీ

**చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ నూనె, సబ్బులను అందించారు. ప్రజారోగ్యం విభాగంలో విధులు నిర్వహిస్తున్న 510 మంది పారిశుధ్య కార్మికులకు 2022-23 సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్కరికి 4.2 లీటర్ల కొబ్బరి నూనె, 10 సబ్బులను ఈ సందర్భంగా ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ అందజేశారు. పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బుల పంపిణీ కోసం పలుమార్లు టెండరర్లు పిలిచినా ఎవరు ముందుకు రాకపోవడంతో కమీషనర్ డాక్టర్ జె.అరుణ జగనన్న మార్ట్ ద్వారా కొనుగోలు చేసి అందించడానికి చర్యలు తీసుకొన్నారని ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం గోపి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం విజయానికి పక్కా వ్యూహం

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:



తెలుగుదేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయానికి పక్కా వ్యూహం రచించి అమలు చేయాలని చిత్తూరు, తిరుపతి పార్లమెంటు తెలుగుదేశం కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు బీద రవిచంద్రయాదవ్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం సమావేశం మాజీ మేయర్ కఠారి హేమలత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రతి డివిజన్, బూత్ స్థాయిలో పట్టభద్రులను గుర్తించి వారితో తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేలా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఆయన ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు వీరభద్రకాలనీకి వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించి తమ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, దేశం నాయకులు మోహన్‌రాజ్, వెంకటేష్‌యాదవ్, శశికర్‌బాబు, సుబ్రమణ్యంనాయుడు, సిఎం విజయ, అశోక్, మేషక్, వసంత్‌కుమార్, నాగలక్ష్మీ, ఈశ్వర్, ప్రభుతేజ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థుల విజయకేతనం

కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త



డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్ పర్సన్ శాంతనాగరాజ్ తెలిపారు. బిఎస్సీ (ఎంపిసిఎస్)లో పల్లవి 9.17శాతం, రాజేశ్వరి 9.06శాతం, బిఎస్సీ (బిజెడ్‌సి)లో సల్మా 9.0, జ్యోతిక 8.88 పాయింట్లు మార్కులు సాధించారన్నారు. అలాగే బిబిఎలో శ్రావ్య 8.91, రాధిక 8.57, బికాం (సిఎ)లో భువనేశ్వరి 8.68, నిఖిత 8.57, బిఎస్సీ (ఎంఎస్‌సిఎస్)లో సతీష్‌కుమార్ 8.27, శరణ్య 8.18 పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించినవిద్యార్థులనుఅభినందించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మాగోడు పట్టించుకోండి సారూ !!

కుప్పంరూరల్, మార్చి 1 ప్రభాతవార్త



మండలంలోని వానగుట్టపల్లి పంచాయతీ రాగిమానుమిట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గం వెంబడి గుబురు చెట్లు పెరగడంతో ఆ మార్గంలో విష కీటకాలతో సావాసం చేయాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లానూరు - కుప్పం ప్రధాన మార్గం నుంచి వెళ్లే రాగిమానుమిట్ట రోడ్డు ఓ పక్క దుస్థితికి చేరగా మరో పక్క రోడ్డు పక్కన చెట్లు పెరిగి పాములకు నిలయంగా మారిందన్నారు. దీంతో ఈ మార్గంలో చీకటిపడి తిరగాలంటే భయాందోళనలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంగా సర్పంచ్, కార్యదర్శికి తెలిపినా ఫలితం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి - ఎంపిపి

పెద్దపంజాణి, మార్చి 1 ప్రభాతవార్త



వేసవి దృష్ట్యా మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిపి రెడ్డెప్ప పేర్కొన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. నీటి సమస్య ఉందని తీర్చలేదని తన దృష్టికి వచ్చే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మంచినీటి సమస్యపై దృష్టి సారించాలని ఆదేశించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మంత్రి పెద్దిరెడ్డిచే పరామర్శ

సదుం, మార్చి 1 ప్రభాతవార్త



మండల పరిదిలోని తిమ్మానాయనపల్లె సర్పంచి మురళిరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రాజారెడ్డిల తల్లి లక్ష్మమ్మ మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుదవారం సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైకాపా నాయకులు సోమల, సదుం, పుంగనూరు, చౌడేపల్లె మండలాల నుంచి పాల్గొన్నారు.

## సొంత గూటికి తెలుగు తమ్ముళ్లు

యర్రావారిపాలెం మార్చి1ప్రభాతవార్త



గతంలో తెదేపా నుంచి వైసీపీలోకి వెళ్లిన వారు తిరిగి లోకేష్ పాదయాత్ర సందర్భంగా తిరిగి సొంత గూడు తెదేపాలో చేరుకున్న సంఘటన బుధవారం జరిగింది. యర్రావారిపాలెం మండలానికి చెందిన దేశిరెడ్డి శేషాద్రి నాయుడు తన అనుచరులతో యువగళం సందర్భంగా తెదేపా అధ్యక్షుడు పులిపర్తినాని సమక్షంలో తెదేపాలో చేరారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉందని తెలుసుకున్నానని, అందుకే తిరిగి పార్టీలో చేరుతున్నానని చెప్పారు. 2024 ఎన్నికలలో వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాధ, ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు, గురప్పనాయుడు, చంద్రబాబు, కేశవల్‌నాయుడు, నాగరాజ, వేణుగోపి, చరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓల ద్వారానే ఓటరు స్లిప్పులు పంపిణీ

– జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను ఓటర్లకు బిఎల్ఓల ద్వారానే పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ డిఆర్ఓ రాజశేకర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డితో కలసి జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సంబంధించి ఉపాధ్యాయులు, పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్పందన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఆర్డీఓలు డాక్టర్ రేణుక, సృజన, శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రకటనల జారీకి ముందస్తు అనుమతి తప్పనిసరి

– డిఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు, వారి తరపున వ్యక్తులు ఎవరైనా ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనల జారీకి ఎంసిఎంసి ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డిఆర్ఓ రాజశేఖర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీకి కలెక్టర్ హరినారాయణన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని, మెంబర్ సెక్రటరీగా జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పద్మజ, సభ్యులుగా డిఆర్ఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రాజశేఖర్, ఆల్‌ఇండియా రెడియో బ్రాడ్‌కాస్టింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం.సుధాకర్‌లు వున్నారన్నారు. వీరు ప్రతి రోజు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలను నిరంతరం పరిశీలించి ప్రకటనలు, చెల్లింపు వార్తలు గుర్తించి సంబంధిత అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కింద చూపుతారన్నారు.

## విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

కుప్పంరూరల్, మార్చి 1 ప్రభాతవార్త



విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని కుప్పం పబ్లిక్ స్కూల్ ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని కెపిఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దమయంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎంఎల్‌సి అభ్యర్థి విజయం కోసం టిడిపి ప్రచారం

తడ, మార్చి 1 ప్రభాతవార్త



తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో బుధవారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. తడ మండలంలో ఆయన పర్యటించారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి బ్యాంకు ఉద్యోగులను, ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురు ఉద్యోగులను కలిసి టిడిపి మద్దతుతో పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్నికల అబ్జర్వర్ సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి నీలకంఠం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కె.సెల్వం, పార్టీ నాయకులు ఫణి, యుగంధర్‌రెడ్డి, ఆంబాకం జీవా, సుందరం, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన నాయుడుపేట సిఐ

ఓజిలి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మార్చి 13న నిర్వహించే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం నాయుడుపేట సిఐ వైవి సోమయ్య, ఓజిలి తహశీల్దార్ తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బందికి ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు కావాల్సిన వసతులను పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యాలయంలో విద్యుత్, నీటి సౌకర్యం అన్నీ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఓజిలి తహశీల్దార్ డి.లాజరస్, ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

గూడూరు, మార్చి 1 ప్రభాతవార్త



గూడూరు రూరల్ మండలం మేకనూరు గ్రామానికి చెందిన కొట్టుబోయిన సంపూర్ణమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒక లక్షా పదివేల రూపాయలు చెక్కులను గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఆపదకాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలను సీఎం సహాయ నిధి నుంచి అందిస్తున్నారని తెలిపారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ సంగ్రామ పాదయాత్ర

గూడూరు, మార్చి 1 ప్రభాతవార్త



ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్, మహాసన సోషలిస్ట్ పార్టీ తలపెట్టిన రెండో విడత మాదిగల సంగ్రామ పాదయాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. పట్టణంలోని అరుంధతీయవాడలో ఉన్న మాతమ్మ దేవాలయం వద్ద అమరవీరులకు నాయకులు ఘన నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ తదితరులు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రిజర్వేషన్ల వర్గీకరణ చేపడతామని బిజెపి ప్రకటించినా నేటికీ అమలు చేయలేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయన్నారు. ఈ నెల 15వ తేదీన రాజధాని ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టామని, సంగ్రామ పాదయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పందిటి అంబేడ్కర్ మాదిగ, కోలగట్ల రమేష్ మాదిగ, మందా పెంచలయ్య, వంగపూరి పెంచలయ్య, సిసింద్రి, గోవిందు శ్రీనివాసులు, మస్తాన్, వినోద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీలు

కోట, మార్చి 1 ప్రభాతవార్త

కోట మండలం గూడలి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 2021-22 సంవత్సరానికి సంబంధించిన పనులను బుధవారం డిఆర్‌పిలు తనిఖీ చేశారు. సమగ్రంగా అన్ని పనులు, రికార్డులు తనిఖీలు చేసి నివేదికలను ఉన్నతాధికారులు పంపుతామని తెలిపారు.

# వైసీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, మార్చి 1 ప్రభాతవార్త

మార్చి 13వ తేదీన జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులుగా వైసీపీ బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం



నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి న్యాయం చేయగల వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తించి ఆయన బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైసీపీ నేతలు జెట్టి వేణుయాదవ్, గోగుల తిరుపాల్, మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

కోట, మార్చి 1 ప్రభాతవార్త

నూతన ఆవిష్కరణలపై యువ ఇంజనీర్లు దృష్టి సారించాలని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో ఏక్సియన్-2023 జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సదస్సును ఈ నెల 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని పలు నూతన సాంకేతిక అంశాలను ప్రదర్శించి చర్చిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమదైన రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరనాథరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అడుగులు వేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల కళాశాలలకు ఈ సదస్సుకు సంబంధించి ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు. ఈ సదస్సులో సాంకేతికపత్రాల ప్రదర్శన, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, స్పాట్ ఈవెంట్స్ ఉంటాయని ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జి.కామేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కోఆర్డినేటర్లు సందీప్‌కుమార్‌రెడ్డి, లిఖిత, సర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.

## కోట సిడిపిఓగా మునికుమారి బాధ్యతలు స్వీకరణ

కోట, మార్చి 1 ప్రభాతవార్త

కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా మునికుమారి స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సూళ్లూరుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా ఉంటూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సిడిపిఓగా ఉన్న జ్యోతి కోవూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మునికుమారి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉన్న పథకాలను ప్రజలకు చేరవేస్తామని తెలిపారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

– మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట, మార్చి 1 ప్రభాతవార్త

రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేట ప్రాంతంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఆమె పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో వార్డు, గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెల్లవారుజామున 5 గంటలకే వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వార్డు కౌన్సిలర్ దారా రవి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కటకం జయరామయ్య తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- కరెంట్ బిల్లు, ఆధార్ వెరిఫికేషన్ కాల్స్‌తో తస్మాత్ జాగ్రత్త

- గూడూరు టౌన్ సిఐ హజరత్‌బాబు

గూడూరు, మార్చి 1 ప్రభాతవార్త



ఎనీ డెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి బిల్లు కట్టమని ఎవరైనా ఫోన్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గూడూరు టౌన్ సిఐ హజరత్‌బాబు అన్నారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ఎనీ డెస్క్ యాప్ డౌన్‌లోడ్ చేసి కరెంటు బిల్లు, ఆధార్ వెరిఫికేషన్ అంటూ ముందు రెండు మూడు రూపాయలు ఆ యాప్ ద్వారా పేమెంట్ చేయమంటారని, డబ్బులు పంపే క్రమంలో సీక్రెట్ లాక్‌తో పాటు పూర్తి ఆధారాలు సైబర్ నేరగాళ్లు సేకరిస్తారని ప్రజలు జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ఆ విధంగా కాల్ చేసి వివరాలు అడిగితే పోలీసులకు తెలపాలన్నారు. ఈ మధ్య చాలామంది సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని, ఈ విధంగా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నారని తెలిపారు.

**ఓటీపీ అడిగితే చెప్పొద్దు**

బ్యాంకు అధికారులమని, మీ డెబిట్ కార్డు త్వరలో బ్లాక్ అవుతుందని, కెవైసీ అప్‌డేట్ చేయాలని ఫోన్లు చేస్తారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని గూడూరు టౌన్ సిఐ హజరత్‌బాబు అన్నారు. బ్యాంకు అధికారులు అనేసరికి చాలామంది నమ్మి అడిగిన సమాచారం ఇస్తారని, ఇలా ఇస్తే మీ బ్యాంకులు ఉన్న నగదును ఖాళీ చేస్తారని తెలిపారు. కార్డు వివరాలు తీసుకున్నాక బాధితుల సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటిపిని తమకు చెప్పాలని సైబర్ నేరగాళ్లు చెప్తారని తెలిపారు. ఓటిపి చెప్తే డబ్బు సైబర్ నేరగాళ్ల చేతికి వెళుతుందని తెలిపారు. ఒక వేళ మోసపోతే బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి కార్డు బ్లాక్ చేయించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఎంఎల్‌సి ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

– తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ

నాయుడుపేట, మార్చి 1 ప్రభాతవార్త



మార్చి 13వ తేదీన జరగనున్న ఎంఎల్‌సీ ఎన్నికల్లో సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని కెకె కల్యాణ్ సదన్‌లో ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పిఓలు, ఎపిఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన హాజరై సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీఓలు చంద్రముని, కిరణ్‌కుమార్‌లతో పాటు ట్రైనర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

# పెద్దల సభకు శ్యాంప్రసాద్‌రెడ్డిని పంపుదాం

- ఎంఎల్‌సి వేళ్ల అప్పిరెడ్డి

కోట, మార్చి 1 ప్రభాతవార్త

తూర్పు రాయలసీమ వైసీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని శాసనమండలి సభ్యులు వేళ అప్పిరెడ్డి కోరారు. బుధవారం ఎ1 కన్వెన్షన్ హాలులో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఎంతో క్రమశిక్షణ కలిగిన యువనేత, విద్యావంతుడు, ప్రజల సమస్యల పట్ల అవగాహన కలిగిన నాయకుడు పేర్నాటి




శ్యాంప్రసాద్‌రెడ్డిని ఎంఎల్‌సి అభ్యర్థిగా గెలిపించాల్సిన బాధ్యత మండల ఇన్‌ఛార్జిలపై ఉందని దిశానిర్దేశం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పురాయలసీమ పట్టభద్రుల వైసీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక సలహాదారుడు ధనంజయరెడ్డి, తిరుపతి వైసీపీ పార్లమెంటు నియోజకవర్గం మైనార్టీ సెల్ నాయకుడు మొబిన్‌బాషా, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, మండల ఇన్‌చార్జిలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన

**- పిఓ అందించే మార్కర్‌తోనే నెంబర్ మార్క్ - రాజకీయ పార్టీ నేతల సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్**



చిత్తూరు, మార్చి1 (ప్రభాతవార్త): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధు లను కోరారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ఈ నెల 13, 16వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్, కౌంటింగ్ కార్యక్రమాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని, పిఓ ఇచ్చిన మార్కర్‌తోనే ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వుంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమీషన్ ఆమోదిం చిన పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీలకు అందించడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకొనే ఓటరుకు ఎడమ చేతి చూపుడు వేలుకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకొనే ఓటరుకు కుడి చేయి మధ్యవేలుపై మార్కింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకొనే వారు తప్పనిసరిగా ఎదైనా గుర్తింపు కార్డు తీసుకురావాల్సి వుంటుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి బ్యాలెట్ పేపర్ తెలుపు రంగు, ఉపాధ్యా య ఎమ్మెల్సీకి బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో వుంటుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు ఎలా వేయాలి అనే విషయంపై పోస్టర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు నియ మించుకొనే అభ్యర్థులు పిఓ ద్వారా గుర్తింపు కార్డును పొందవచ్చునన్నారు. ఈ నెల 13న ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, 16న ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఆర్‌విఎస్ కళాశాల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు లా కళాశాలలో నిర్వహించడం జరుగుతుంద న్నారు. అలాగే ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఫారం-18 ద్వారా పాస్ పొందాల్సి వుంటుందన్నారు. పట్ట భద్రుల ఓట్ల లెక్కింపుకు 20 టేబుళ్ళు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుకు 14 టేబుళ్ళు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైకాపా తరపున ఎమ్మెల్యే పిఆర్ఓ నరసింహులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు వెంకిటీల సురేంద్ర కుమార్, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరదేశి, సిపిఐ, సిపిఎం పార్టీల నేతలు పాల్గొన్నారు.

## పక్కాగా ఎన్నికల నిబంధనలు పాటింపు

**- 9వ తేదీలోపు పోలింగ్ ఏజెంట్ల వివరాలు సమర్పణ - ఎమ్మెల్సీ అభ్యర్థులతో జాయింట్ కలెక్టర్**

చిత్తూరు, మార్చి 1 (ప్రభాతవార్త): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల కమీషన్ నిబంధనలకు పక్కాగా పాటించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఎమ్మెల్సీ అభ్యర్థులతో సమావేశమై బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహణకు, మైక్‌సెట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల పేర్లు తెలుగులో ముద్రించబడి వుంటాయని, పేర్ల ప్రక్కనే ప్రాధాన్యత గడి వుంటుందని, ఓటింగ్‌పై క్షేత్ర స్థాయిలో ఓటర్లకు అభ్యర్థులు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వేరు వేరు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ ఏజెంట్లుగా నియమితులయ్యే వారి జాబితాను ఈ నెల 9వ తేదీలోపు డిఆర్‌ఓలకు అందించాలన్నారు. ఏజెంట్లు పోలింగ్ రోజు ఉదయం వారికి సంబంధించిన వివరాలు ఫోటోతో సహా సమర్పించాల్సి వుంటుందన్నారు. అలాగే ఎన్నికల ఖర్చుకు సంబంధించిన వివరాలు అభ్యర్థులు ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత సమర్పించాలన్నారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుందని, ఏజెంట్ల నియామకంతో పాటు వాహనాల అనుమతి కోసం డిఆర్‌ఓను సంప్రదించాలన్నారు. కరపత్రాలు ముద్రించే అభ్యర్థులు తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ పేరు, ముద్రిం చిన కరపత్రాల సంఖ్యను వేయాల్సి వుంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగంకు ఎన్నికల సంఘం ఇచ్చిన పెన్నును ఉపయోగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి ఓటును వినియోగించుకొంటే ఆ ఓటు చెల్లుబాటు కాదన్నారు. ఈ సమావేశంలో అధికారులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' విద్యార్థులు



సత్యవేడు, మార్చి 1 (ప్రభాతవార్త): కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ చొరవతో 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' యువసంఘం కార్యక్రమంలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఎన్ఐటి, ఇతర విద్యాసంస్థల నుంచి 28 మంది విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఐదురోజుల ఆంధ్ర ప్రదేశ్ పర్యటనలో భాగంగా చివరిరోజు ఇక్కడకు వచ్చిన విద్యార్థులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాధర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థుతో ముఖాముఖి చర్చిల్లో పాల్గొన్న ఆయన దేశ సమైఖ్యలను చాటిచెపుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ స్ఫూర్తికి శ్రీసిటీని చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. భారత్‌తో సహా 28దేశాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుతో దేశ, విదేశాలకు చెందిన ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్న ఈప్రాంతం వివిధ భాషలు, సంస్కృతులకు నిలయంగా మారింద న్నారు. భవిష్యత్‌లో దేశంలో విభిన్న ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహించేందుకు విద్యార్థులకు ఈకార్యక్రమం అత్యంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖాముఖిలో ఎంతో ఆసక్తితో శ్రీసిటీ గురించి పలు అంశాలను తెలుసుకున్న విద్యార్థులు, అనంతరం శ్రీసిటీ పరిసరాలను తిలకించారు. ఎన్‌హెచ్‌కె స్ప్రింగ్స్, ఎంఎండి హెవీ మెషిన్స్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించి అక్కడి ఉత్పత్తులు, పనివాతావరణాన్ని పరిశీలించారు. ప్రపంచశ్రేణి సదుపాయాలు, 200కు పైగా పరిశ్రమలు, చక్కని వాతావరణం తమనెంతో ఆకట్టుకుందని ఈసందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ అధ్యాయనానికి ఆతిథ్యమిచ్చిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' అనేది భారత ప్రభుత్వంచే ప్రారంభించబడిన నూతన పథకం. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న సాంస్కృతిక సంబంధాల ద్వారా ఔక్యతను పెంపొందించడం, వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల మధ్యసంబంధాలను మెరుగుపరచడం ఈపథకం లక్ష్యం. ఇందులో అంతర్భాగమైన యువసంఘం కార్యక్రమం ద్వారా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులను ఒక రాష్ట్రం నుంచి మరోక రాష్ట్రానికి పంపి, ఆయా ప్రాంతాలలో పర్యాటకం, సంప్రదాయాలు, సుస్థిర అభివృద్ధి, టెక్నాలజీ, ప్రజలమధ్య అనుసంధానం వంటి ఐదు ప్రధాన అంశాలలో అవగాహన కల్పిస్తారు. పరిశ్రమలు, పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించి వారిని ఉత్తేజితులను చేస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుపతి ఐఐటీని ఈకార్యక్రమానికి నోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తించారు.

## డాక్టర్ యుగంధర్‌కు కోవిడ్ ఛాంపియన్ అవార్డు



తిరుపతినగరం, మార్చి 1 (ప్రభాతవార్త): తిరుపతి చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు, తిరుపతి ఐఎంఎ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగంధర్‌కు కోవిడ్ ఛాంపియన్ అవార్డును ముంబైలోని గ్లోబల్ ఫేమ్, సోను సూధ్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో అందజేశారు. కోవిడ్ కాలంలో యుగం ధర్ అందించి వైద్య, సామాజిక సేవలను గుర్తించి హీరో సోనుసూధ్ చేతులు మీదుగా బహూకరించారని తెలిపారు. డాక్టర్ యుగంధర్ దాదాపు లక్షమంది కోవిడ్ రోగులకు వైద్య సేవలు అందించడమే కాకుండా, తన సూచనలు సలహాలతో కోవిడ్ బారిన పడకుండా వారిలో అత్మస్థైర్యాన్ని నింపారని వివరించారు. కోవిడ్ రోగులకు ఉచితంగా మందులు, ఆహారాన్ని అందించారని, పేద ప్రజలకు, రోగులకు నేటికీ ఉచిత సేవలు అందిస్తున్నామన్నారు. యుగంధర్ మాట్లాడుతూ బాలీవుడ్, టాలీవుడ్‌లో ప్రముఖ హీరోగా, విలన్‌గా గొప్ప పేరు తెచుకున్న సోనుసూధ్ చేతుల మీదుగా కోవిడ్ ఛాంపియన్ అవార్డు తీసుకోవడం చాలా ఆనందంగా వుందన్నారు. ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్ని పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేందుకు కృషి చేస్తాని తెలిపారు.

## రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యం

**- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



గూడూరు, మార్చి 1 (ప్రభాతవార్త : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓ నియంత పాలకుడని, వైసీపీ ప్రభుత్వం త్వరలోనే ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. బుధవారం గూడూరు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఒక నియంత, ఫ్యాక్షనిస్ట్ అని, అరాచకవాది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే కరువు వస్తే, జగన్ వస్తే కరోనా వచ్చిందా అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో రైతులు, ఉద్యోగులు, టీచర్లు అందరూ మునిగిపోయారని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు దేశంలోనే ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయని, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు ఇప్పటికే ఏడుసార్లు పెంచి ఈ నెల నుంచి మరో 50 పైసలు యూనిట్‌పై పెంచుతున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు జరుగుతున్నాయో ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి మనందరిపై అప్పుల భారం మోపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా అప్పు లు చేసి మరింత భారం మనందరిపై మోపు తారని విమర్శిం చారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించి వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అందరం కష్టపడి ఎంఎల్‌సి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, గూడూరు నియోజకవర్గంలో అధిక మెజారిటీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహకు కార్యదర్శి దామచర్ల సత్యం, నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పరిశీల కులు అయితాబత్తుల ఆనందరావు, పనబాక కృష్ణయ్య, నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర, పార్లమెంట్, పట్టణం, మండలం, వార్డు, గ్రామం, అనుబంధ సంఘాల నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైన్సు ఒలింపియాడ్‌లో...
## దస్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు



శ్రీకాళహస్తి, మార్చి 1 (ప్రభాత వార్త : సైన్సు ఒలింపి యాడ్‌లో దస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి తమ సత్తాచాటారు. ఈసందర్భ ంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఒక్క విద్యకే ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని రంగాల్లో విద్యార్థినీ విద్యార్థులు రాణించేలా సిద్ధం చేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి సైన్సు ఒలింపియాడ్ జాతీయ స్థాయి పరీక్షలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఆసంస్థ అందించిన బంగారు పతకాలను విద్యార్థులకు అందించి కరస్పాండెంట్ అభినందించారు. ఈఏడాది తమ పాఠశాల నుంచి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో సైన్సు ఒలింపియాడ్ పోటీ పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గాలి కుంటు టీకా వేయిద్దాం...పశువులను కాపాడుకుందాం

**-పశువుల గాలికుంటు వ్యాధికి టీకా విడుదల చేసిన కలెక్టర్**



తిరుపతిరూరల్, మార్చి 1 (ప్రభాతవార్త): పశువులకు గాలి కుంటు టీకా వేయిద్దాం....పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి టీకా విడుదల చేసి, గాలి కుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద మార్చి1 నుండి 31వరకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో గ్రామాలలో కొనసాగుతుందని, రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. పశువైద్యాధికారులు, ఆబికెలోని పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాల మిత్ర తదితర సిబ్బంది ఉదయమే గ్రామాలను సందర్శించి టీకాలు వేస్తాని, ఈ సదవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ టీకా వేయించుకున్న రైతులకు ఆర్థిర నష్టాన్ని కలగజేసే గాలకుంటు వ్యాధి నివారణకు రైతులందరూ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఈ టీకా నాలుగు నెలలు పైబడి వయస్సున్న దూడలకు కూడా వేయించడం వలన దూడలలో మరణాల శాతం తగ్గి దూడల ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగపడుతుందని, పశువుల గుర్తింపుకు చెవిపోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రవికుమార్, ఏ.డి.లు గురునాథ్, భవానిశంకర్, డాక్టర్లు శైలజ, నాగశిల్ప, శ్రీదేవి, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం-ఒక స్మగ్లరు అరెస్టు



యర్రావారిపాలెం, మార్చి1 (ప్రభాతవార్త : తలకోన అటవీ ప్రాంతంలో పాపనాశనం ఫారెస్టు బీటు పరి ధిలో బుధవారం 10 ఎర్రచందనం దుంగలు స్వా ధీనం చేసుకోవడంతో పాటు ఒక స్మగ్లర్ ను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన టీమ్ మంగళవారం నుంచి కూంబింగ్ చేపట్టింది. ఆర్ఎస్ఐ లింగధర బృందం తిరుమల నుంచి తలకోన మీదుగా కూంబింగ్ చేపట్టింది. పాపనాశనం ఫారెస్టు బీట్ పరిదిలో గుంజన సెక్షన్ వద్ద బుధవారం తెల్లవారు జామున కొంత మంది దుంగలను మోసుకు వెళుతూ తారసపడ్డారు. వారిని హెచ్చరించి చుట్టు ముట్టే ప్రయత్నం చేయగా దుంగలు పడేసి చీకట్లో పారిపోయారు. టాస్క్ ఫోర్సు సిబ్బంది వెంబడించడంతో ఒక స్మగ్లర్ దొరికాడు. అతడు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తురు ప్రాంతానికి చెందిన సురేష్‌గా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్‌ను పట్టుకుని కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం - నలుగురికి గాయాలు

తడ, మార్చి 1 (ప్రభాతవార్త : తడ మండలం కాదలూరు మార్గం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రెండు మోటార్‌బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కాదలూరు మలుపు వద్ద రెండు మోటార్‌బైక్‌లు వేగంగా వస్తూ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించినట్లు తెలిసింది. అయితే ఈ సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

## శివయ్య హుండీ రాబడి రూ.1.37కోట్లు



శ్రీకాళహస్తి, మార్చి 1 (ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో భక్తులు 20రోజుల పాటు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. హుండీల్లో రూ.1కోటి 37లక్షల 29వేల 296లు వచ్చినట్లు సాయంత్రం ప్రకటించారు. ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద లెక్కింపు జరిపారు. నగదుతో పాటుబంగారు 0.116.800 గ్రాములు, వవెండి నాగపడగల రూపంలో 334.900 గ్రాములు వచ్చింది. అలాగే విదేశీ నగదు కూడా వచ్చింది. 89 నోట్లు వచ్చినట్లు ఆలయాధికారి వికె సాగర్‌బాబు వివరించారు. ఇందులో అమెరికాకు చెందినవి 28, మలేషియాకుచెందినవి 34, ఇతర దేశాలకు సంబంధించినవి 20 యూనైటెడ్ అరబ్ దేశాలకు సంబంధించినవి ఏడు నోట్లు వచ్చినట్లు వివరించారు. లెక్కింపుల్లో అకౌంటెంట్ ప్రశాంత్, ఎఇఓ సతీష్‌మాలిక్ సూపరింటెండెంట్ శ్రీహరి ప్రసాద్, ఇఇ మురళీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుష్పయాగంలో ముగిసిన వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 1 (ప్రభాతవార్త : శ్రీకాళ హస్తి మండలంలోని తొండమాన్‌పురంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయంగా ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధ వారం సాయంత్రం స్వామిఅమ్మవార్లకు నిర్వహించిన పుష్పయాగంతో ముగిసాయి. సాయంత్రం నుంచి ఆలయంలో భక్తజనసందోహం కనిపించింది. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవానికి తీసుకువచ్చి వేదికపైకి తీసుకువచ్చారు. వేదపండితులు వేదమంత్రాలు పటిస్తుండగా పుష్పయాగాన్ని కన్నులపండుగా నిర్వహించారు. కార్యక్రమానికి అశేష భక్తజనసంద్రం హాజరవడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది. తొండమాన్‌పురానికి చెందిన గ్రామస్తులు సుమారు 250కిలోల పూలను ఆలయానికి వితరణగా అందించారు. కార్యక్రమంలో డిప్యుటీ ఈవో దేవేంద్రబాబు, ఎఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి, అర్చకులు రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని



కాణిపాకం, మార్చి 1 (ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీ సమే తంగా బుధవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శిం చుకున్నారు. ఆయనకు ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఎ.మోహరెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ఆయన పూజలు నిర్వహించారు. స్పీకర్ వెంట ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరిన్‌టెండెంట్‌లు శ్రీనివాస్, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు, ఐరాల తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, స్థానిక ఎస్పై మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మపథం వైపు నడిపించాలని ప్రార్థించా...**

సర్వకాల సర్వావస్థల యందు తోడు నీడగా వుండి మమ్మల్ని ధర్మపథం వైపు నడిపించి ప్రజల్ని కాపాడమని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని ప్రార్థించినట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం కాణిపాకం స్వామివారి దర్శనానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మనసా వాచా కర్మణా తాను కాణిపాకం వినాయకుని నమ్మినట్లు తెలిపారు. అందుకే తరచూ స్వామివారి దర్శనానికి వస్తుంటానని తమ్మినేని సీతారాం తెలిపారు.

## మాజీ డిప్యూటీ స్పీకర్ కుతూహలమ్మకు ఘన నివాళి



వెదురుకుప్పం, మార్చి 1 (ప్రభాతవార్త :మాజీ డిప్యూటీ స్పీకర్, వైద్య ఆరోగ్యశాఖమంత్రి గుమ్మడి కుతూహలమ్మకు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో ఆమె మృతి చెందన విషయం పాఠకులకు తెలిసిందే. కాగా బుధవారం గంగాధర నెల్లూరు మండలం వింజం పంచాయితీ పరిధిలోని వింజం లక్ష్మీ రెడ్డిపల్లెలో కర్మక్రియలు నిర్వహించారు. కార్యక్రమంకు పలువు పెద్దలు హాజరై కుతూహలమ్మ చిత్ర పటంకు ఘనంగా నివాళి అర్పించారు. ఆమె డాక్టర్ వృత్తిలో ఉండి రోగులకు సేవలు అందజేశారు. తరువాత చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా తొలిత రాజకీయ రంగప్రవేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యేగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. నిరాడంభరంగా జీవనం సాగించిన గొప్ప ఔన్యతం ఆమె సొంతమని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జడ్పీ ఛైర్మెపర్సన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే గాంధీ, పలువురు రాజకీయ ప్రముఖులు, గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి



సోమల, మార్చి1 (ప్రభాతవార్త : మండల పరిదిలోని ఆవులపల్లెలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి జరుగుతున్న బ్రహ్మోత్స వాలలో భాగంగా బుధవారం రాష్ట్ర విద్యుత్ పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి అర్చకులు ఇష్టికల్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వేల ఎకరాలకు సాగునీటి కొరత రాదని చెప్పారు. ఆయన వెంట తితిదే బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, మార్కెట్ కమిటీ మాజీ అద క్షుడు నాగేశ్వరరావు, జడ్పీటీసీ అమాసమోహన్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు.

## నగరిలో కాటన్ చీరలు బేష్ - మంత్రి రోజా



నగరి, మార్చి 1 (ప్రభాతవార్త: నగరిలోని ఓ చీరలు తయారు చేసి విక్రయించే దుకాణంలోకి మంత్రి రోజా వెళ్లి అక్కడ కాటన్ చీరలు చూసి ముగ్ధలయ్యారు. తాను కాటన్ చీరలు కొనుక్కోవడమే కాకుండా మిగిలిన మహిళలను కూడా కాటన్ చీరలు కొనుక్కోవాలని సూచించారు. నగరిలో తయారయ్యే కాటన్ చీరలు చక్కగా ఉంటాయని, సాంప్రదాయబద్ధంగా సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా రిచ్ లుక్‌గా ఉంటాయని తెలిపారు. మరి రానున్న వేసవి కాలంలో కాటన్ చీరలకు బ్రాండ్ అంబాసిడర్ మన మంత్రి రోజా అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల తయారీ కేంద్రాన్ని స్వయంగా సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం లో స్వామివారి కల్యాణోత్సవంలోపాల్గొనే జంటల్లో మగవారికి ఇచ్చే ఉత్తరీయం అంటే కండువాలు నగరి నుంచే తయారు అవుతాయని, ఇక్కడి చేనేత కార్మికులు భగవంతుని సేవలో పాల్గొనడం మా అదృష్టమని మంత్రి పేర్కొన్నారు. ఆమెతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన

**- పొరబాట్లకు తావివ్వకుండా విధులు నిర్వహణ - పిఓలు, ఎపిఓలతకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ శిక్షణ**



చిత్తూరు, మార్చి 1 (ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పిఓలు, ఎపిఓల పాత్ర కీలకమని, పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన వుండాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారా యణన్ పేర్కొన్నారు. పివికెఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులైన వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పిఓలు, ఎపిఓలు ఎలాంటి పొరబాట్లకు తావివ్వకుండా విధులకు పక్కాగా నిర్వర్తించా లన్నారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి పొరబాట్లకు తావివ్వ చేయడానికే పిఓలు, ఎపిఓలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకొని పక్కాగా పోలింగ్‌ను నిర్వర్తించి పూర్తి చేయాలన్నారు. అలాగే ఎన్నికల విధులకు హాజరయ్యే పిఓలు, ఎపిఓలకు మరోమారు శిక్షణ వుంటుంద న్నారు. ఎన్నికల శిక్షణలో హ్యాండ్ బుక్‌లో పొందుపరచిన అంశాలు పూర్తి స్థాయిలో అవగాహన చేసుకొని ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ రోజు బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పిఓ డైరీ తదితర అంశాలపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేయడం తదితర అంశాలపై అవగాహన వుండాలన్నారు. పోలింగ్ నిర్వహణకు నియామకం అయిన పిఓలు, ఎపిఓలు సంబంధిత ఆర్డీఓకు 12వ తేదీ రిపోర్ట్ చేయాలని, పోలింగ్ సామాగ్రిని అదే రోజు తీసుకొని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రంకు సాయంత్రం చేరుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్టు మేరకు ప్రతి అంశంపు పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ రోజున ఏజెంట్లకు పాసులు, సిట్టింగ్ అరెంజ్‌మెంట్లను ఉదయం 7 గంటలకల్లా పూర్తి చేసి 8 గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు డాక్టర్ రేణుక, సృజన, శివయ్యలు, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, Ex.S.No.2612845P, Rank:Ex/L/NK/ MACP HAV, AshoK Kumar.P, S/o Late P. Krishnaiah, R/o D.No.14-31, Sanyasi-palle(V), Klavagunta(P), Penumur(M), Chittoor Dist., A.P. -517 127. In my Army Records my son name was wrongly entered as **P. Mokshith (Old Name)** instead of **PENUMUR MOKSHANSH** (New Name).